
MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

# మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 29 | బుధవారం 4 ఫిబ్రవరి 2026 | పేజీలు : 4 | వెల : 3/-



(అంకుశం, గుంటూరు, ఫిబ్రవరి 4):
మాజీ మంత్రి అంబటి రాంబాబు కుటుంబ సభ్యులను వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పరామర్శించారు. అండగా ఉంటానని మాజీ సీఎం ధైర్యం చెప్పారు. గుంటూరులోని అంబటి రాంబాబు నివాసంపై టీడీపీ గూండాలు దాడి చేసి ఆయన్ని, ఆయన కుటుంబ సభ్యులను హతమార్చేందుకు ప్రయత్నించారని వైయస్ఆర్సీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనతో భయాందోళనకు గురైన కుటుంబ సభ్యులను ధైర్యం - మిగతా2లో

టీడీపీ కార్యకర్తల దాడిలో ధ్వంసమైన కార్లను పరిశీలించిన జగన్



## 'అంబటి' కుటుంబ సభ్యులకు
# వైయస్ జగన్ పరామర్శ






## మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన ఎత్తివేత

- ఇప్పటికే మణిపూర్ సీఎంగా యుమ్నం ఖేంచంద్‌ను బీజేపీ ప్రకటించిన సంగతి తెలిసిందే
- దాదాపు ఏడాది తర్వాత రాష్ట్రపతి పాలనను ఉపసంహరించుకుంది
- ఈశాన్య రాష్ట్రంలో రాజ్యాంగ ప్రక్రియను అధికారికంగా పునరుద్ధరించాలని హోం మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ



## ప్రధాని మోదీకి జనరల్ నరవణే రాసిన పుస్తకం అందజేస్తా

- ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్ర విమర్శలు గుప్పించిన రాహుల్ గాంధీ
- డోక్లాం వివాదం సమయంలో మోదీ తన బాధ్యతను సరిగ్గా నిర్వర్తించలేదని ఆరోపణలు
- ఆ పుస్తకంలోని విషయాలు లద్దాఖ్ సంక్షోభ సమయంలో ప్రభుత్వ ప్రతిస్పందన గురించి నిజాలను వెల్లడిస్తాయి
- "ఈ బుక్ అసలు లేదని, స్పీకర్, కేంద్ర ప్రభుత్వం, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ చెప్పారు.

## తిరుమల కల్తీ లడ్డూ వ్యవహారం
# ఏం చేద్దాం!

- సీఎం చంద్రబాబుతో పవన్ కళ్యాణ్ భేటీ
- కుల రాజకీయాలు రెచ్చగొట్టి వైఎస్సార్సీపీ చేస్తున్న కుట్రలను ఎదుర్కొనే వ్యూహంపై చర్చ
- టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు వైఎస్సార్సీపీ కుట్రల ఉచ్చులో పడకుండా జాగ్రత్తల పైనా సమావేశం
- త్వరలో ఖాళీ కానున్న 4 రాజ్యసభ స్థానాలపైనా సమాలోచన
- చంద్రబాబు, పవన్ భేటీలో పలు అంశాలపై చర్చ



**అమరావతి**
తిరుమల లడ్డూ వ్యవహారంపై ఏమి చేద్దామని ముఖ్యమంత్రి చంద్రబాబు , డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చర్చించారు. బుధవారం వారిద్దరూ భేటీ అయ్యారు. రెండున్నర గంటలపాటు వారిద్దరూ సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న తాజా రాజకీయ పరిణామాలపై చంద్రబాబు, పవన్ మధ్య ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. కుల రాజకీయాలను వైకాపా రెచ్చగొడుతోందని.. ఆ కుట్రలను ఎదుర్కొనేందుకు, ఆ పార్టీ ట్రాప్‌లో పడకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని నేతలిద్దరూ నిర్ణయానికి - మిగతా3లో



## వ్యవసాయ శాఖకు అదనపు నిధులు కేటాయించండి

### ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను కోరిన వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్న

**అమరావతి**
ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్ వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో, ముందస్తుగా బడ్జెట్ కూర్పుపై రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో రైతన్నలకు బలమైన అండగా నిలిచేలా వ్యవసాయ, అనుబంధ శాఖల అభివద్ధికి, అలాగే రాష్ట్రంలో పాడి పరిశ్రమను మరింత ప్రోత్సహించే దిశగా వ్యవసాయ మరియు పశుసంవర్ధక శాఖలకు అవసరమైన నిధుల కేటాయింపులపై సుదీర్ఘంగా - మిగతా3లో

## భారత్-అమెరికా ట్రేడ్ డీల్‌తో వ్యవసాయ, పాడి రంగాలకు పూర్తి రక్షణ

ఇండియా-యూఎస్ డీల్‌లో సుంకాలు 50 శాతం నుంచి 18 శాతానికి తగ్గుతాయ్

మేక్ ఇన్ ఇండియా, డిజైన్ ఇన్ ఇండియాలను ప్రమోట్ చేయడానికి వీలు కల్పిస్తుంది కూడా



## సాగునీటి సంఘాల అధ్యక్షులతో
# రేపు సమావేశం

- హాజరుకానున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్
- వివరాలు వెల్లడించిన మంత్రి నిమ్మల రామానాయుడు
- 5 ఏళ్ళ వైసిపి విధ్వంశ పాలనకు ఇరిగేషన్ వ్యవస్థ గాడి తప్పింది
- 18వేల కోట్ల రూపాయిల బిల్లుల బకాయిలను కూటమి ప్రభుత్వానికి వారసత్వంగా ఇచ్చారు.



**అమరావతి**
జలవనరుల శాఖ ఆధ్వర్యంలో గురువారం అమరావతిలో సాగు నీటి సంఘాల అధ్యక్షులతో భారీ సమావేశం నిర్వహించను న్నారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హాజరు కానున్నారు. ఈ సందర్భంగా నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. 5 ఏళ్ళ వైసిపి విధ్వంశ పాలనకు ఇరిగేషన్ వ్యవస్థ గాడి తప్పింది. 18వేల కోట్ల రూపాయిల బిల్లుల బకాయిలను కూటమి ప్రభుత్వానికి వారసత్వంగా ఇచ్చారు. ఇరిగేషన్ శాఖను గాడిలో పెడుతూ, పోలవరం, హంద్రీనీవా, వెలిగొండ, గాలేరునగరి, పోలవరం ఎడమ ప్రధాన కాలువ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులపై ప్రత్యేక దష్టిపెట్టాం. ఖరీఫ్ పంట ముగిసినా రాయలసీమలో సైతం, రిజర్వాయర్లలో పుష్కలంగా నీరుందంటే చంద్రబాబు వాటర్ మేనేజ్ మెంట్ వల్లే సాధ్యమైంది. నాడు రాయల కాలంలో రాయలసీమ - మిగతా3లో

## బంగాల్‌ను టార్గెట్ చేస్తున్నారు

- ప్రజాస్వామ్యాన్ని కాపాడండి
- సుప్రీంకోర్టులో మమతా బెనర్జీ
- ఓటర్ల జాబితా సవరణపై సర్వోన్నత న్యాయస్థానంలో హైడ్రామా
- ధర్మాసనం ముందు స్వయంగా వాదించిన ముఖ్యమంత్రి



## 'అంబటి' కుటుంబ సభ్యులకు వైయస్ జగన్ పరామర్శ

-మొదటిపేజీ తరువాయి

చెప్పేందుకు వైయస్ జగన్ స్వయంగా వారి నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా దాడిలో ధ్వంసమైన కార్లను వైయస్ జగన్ పరిశీలించారు. నివాసంలో జరిగిన విధ్వంసాన్ని ప్రత్యక్షంగా పరిశీలించిన ఆయన దాడి తీవ్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రశ్నించే గొంతులను అణిచివేయడానికి ఇటువంటి దాడులకు పాల్పడటం అత్యంత హేయమైన చర్య అని ఆయన పేర్కొన్నారు.

## సాగునీటి సంఘాల అధ్యక్షులతో రేపు సమావేశం

-మొదటిపేజీ తరువాయి

చెరువుల నిండితే, నేడు చంద్రబాబు పాలనలో రిజర్వాయర్లు, చెరువులు నిండుకుండల్లా ఉన్నాయి. ప్రతి నీటి బొట్టునూ ఒడిసి పట్టుకుని, భూమిని కూడా రిజర్వాయర్ లా మార్చుకోవాలి. భూగర్భజలాలు పెంచుకోవాలని, కరువు రహిత రాష్ట్రంగా మార్చుకోవాలనేది చంద్రబాబు లక్ష్యం. నీటి భద్రత, వాటర్ మేనేజ్‌మెంట్, భూగర్భజలాల పెంపుపై సాగునీటి సంఘాలకు సీఎం చంద్రబాబు దిశా, నిర్దేశం చేయనున్నారు.

# ఏపీ చరిత్రలో సరికొత్త అధ్యాయం

# 6న క్వాంటమ్ వ్యాలీకి భూమి పూజ



**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ చరిత్రలో సరికొత్త అధ్యాయం ప్రారంభం కాబోతోంది.. చంద్రబాబు కలల ప్రాజెక్ట్‌కు సంబంధించి కీలక ముందడుగు పడబోతోంది. ఈ నెల 6న అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ నిర్మాణాలకు సంబంధించి భూమిపూజ చేయనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా సమీక్షించారు. ఈ నెల 6న ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అమరావతిలో భూమిపూజ కార్యక్రమం నిర్వహించనున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు కలల ప్రాజెక్ట్ క్వాంటమ్ వ్యాలీ దిశగా మరో కీలక ముందడుగు పడింది. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ నిర్మాణాలకు సంబంధించిన భూమిపూజకు ముహూర్తం ఫిక్స్ అయ్యింది. ఈ నెల 6న ఉదయం 11 గంటలకు అమరావతిలోని ఉద్దండరాయునిపాలెం సమీపంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రతిష్మాత్మకంగా నిర్మించనున్న క్వాంటమ్ వ్యాలీ నిర్మాణాలకు భూమిపూజ కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్ట్ కోసం ఏపీ ప్రభుత్వం 50 ఎకరాల భూమిని కేటాయించిన సంగతి తెలిసిందేమరోవైపు అమరావతిలో ఏఐ లివింగ్ ల్యాబ్స్ పేరుతో ఓ యూనివర్శిటీ ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు ఐటీశాఖ ప్రతిపాదనపై ఇవాళ జరిగే కేబినెట్ సమావేశంలో చర్చిస్తారు. ఈ వర్శిటీలో స్కూల్ విద్యార్థుల నుంచి పీజీ వరకు ఏఐలో విద్యా బోధన ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ రానుండటంతో ఈ వర్శిటీ అనుబంధంగా ఉంటుందని చెబుతున్నారు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఓ గేమ్ ఛేంజర్ అంటోంది ప్రభుత్వం. ఇటీవల 14మంది ప్రముఖ నిపుణులతో రెండు కమిటీలను కూడా నియమించిన సంగతి తెలిసిందే. రాబోయే రోజుల్లో మరిన్న కంపెనీలను ఆకర్షించాలని భావిస్తున్నారు. రాబోయే రోజుల్లో భారీగా పెట్టుబడులు, ఉద్యోగాలు రావడం ఖాయం అంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా అందరూ క్వాంటమ్ టెక్నాలజీపై ఫోకస్ పెట్టారని చంద్రబాబు చెబుతున్నారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీ ఆధునిక పరిశోధనలకు కేంద్రంగా మారబోతోందన్నారు. ఏకంగా లక్ష మంది నిపుణుల తయారీ లక్ష్యమని చెప్పుకొచ్చారు. ఇప్పటికే క్వాంటమ్ శిక్షణకు సంబంధించి 50వేలమంది విద్యార్థులు, ఐటీ ఉద్యోగులు రిజిస్టర్ చేసుకున్న విషయాన్ని ప్రస్తావించారు. రాబోయే రోజుల్లో క్వాంటమ్ టెక్నాలజీపై మరింత ఫోకస్ పెడతామన్నారు. ఒకవేళ ఎవరైనా క్వాంటం టెక్నాలజీ ద్వారా నోబుల్ ప్రైజ్ దక్కించుకుంటే వారికి రూ.100 కోట్లు నజరానా ఇస్తామని చంద్రబాబు ప్రకటించిన సంగతి తెలిసిందే. అంతేకాదు ఏపీ ప్రభుత్వం ప్రత్యేకంగా క్వాంటమ్ కంప్యూటింగ్ పాలసీని రూపొందించిన విషయం తెలిసిందే. అభివృద్ధి, స్టార్టప్‌ల ఏర్పాటును ప్రోత్సహించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది.

# ఆ మూడు సీట్లు దక్కేదెలా



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఇప్పటికీ ఒక లోటు ఉంది. రాష్ట్రమంతటా గెలిచామని ఆ పార్టీ భావిస్తోంది. కానీ ఓ మూడు చోట్ల మాత్రం ఆ పార్టీకి ఇప్పటివరకు విజయం దక్కలేదు. జగన్ ప్రభంజనంలో సైతం ఆ మూడు చోట్ల టిడిపి విజయం సాధించింది. విజయవాడ, గుంటూరు, శ్రీకాకుళం పార్లమెంట్ స్థానాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నో రకాల ప్రయోగాలు చేసింది. కానీ ఆ ప్రయోగాలు ఏవి ఫలించలేదు. ఎప్పటికప్పుడు అభ్యర్థులను మార్చింది. ఆ మార్పు ఎంతవరకు కూడా లాభం చేకూర్చలేదు. పైగా ఎంపీలుగా పోటీ చేసిన వైసీపీ నేతలకు అడ్రస్ లేకుండా పోయింది. రాజకీయ జీవితం లేకుండా పోయింది. ముఖ్యంగా విజయవాడ నుంచి పోటీ చేసిన ముగ్గురు నేతలు వైసీపీలో లేకుండా పోయారు. అందుకే ఇప్పుడు బలమైన అభ్యర్థిని రంగంలోకి దించాలని చూస్తున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎవరూ చిక్కడం లేదు. విజయవాడలో పోటీ అంటేనే నేతలు భయపడిపోతున్నారు.2014లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇక్కడ బలమైన అభ్యర్థి అవుతారని భావించి.. పారిశ్రామికవేత్త కోనేరు ప్రసాద్ ను రంగంలోకి దించింది. అంతకు ముందు రెండు ఎన్నికల్లో ఇక్కడ తెలుగుదేశం పార్టీ ఓడిపోవడంతో.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఎక్కువగా ఉంటుందని భావించింది. కానీ వైసీపీ లెక్కలు తప్పాయి. టిడిపి అభ్యర్థి కేసినేని నాని ఘనవిజయం సాధించారు. అయితే ఆ ఎన్నికల తరువాత కోనేరు ప్రసాద్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలకు దూరమయ్యారు. రాజకీయాలకు సైతం గుడ్ బై చెప్పారు.2019 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. అయితే అప్పట్లో కూడా విజయవాడ పార్లమెంటు స్థానం దక్కించుకోలేకపోయింది. రెండోసారి టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన కేసినేని నాని ఇక్కడ ఘనవిజయం సాధించారు. ఆర్థిక బలం ఉన్న పొట్లూరు వరప్రసాద్ ను రంగంలోకి దించింది. ఆయన ప్రముఖ నిర్మాతగా కొనసాగుతుండగా పార్టీ అభ్యర్థిగా ప్రకటించారు జగన్. అయితే రాష్ట్రమంతటా ప్రభంజనం వీచింది కానీ .. విజయవాడలో మాత్రం టిడిపి అభ్యర్థి కేసినేని నాని గెలిచి పట్టు నిలుపుకున్నారు. అయితే ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత పొట్లూరు వరప్రసాద్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి దూరమయ్యారు. క్రమేపి రాజకీయాలకు సైతం గుడ్ బై చెప్పారు.2024 ఎన్నికల్లో అనూహ్యంగా రెండుసార్లు ఎంపీగా పోటీ చేసి గెలిచిన కేశినేని నాని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. అంతకుముందు రెండుసార్లు గెలిచేసరికి అదంతా తన చరిష్మ అన్నట్టు భావించారు. అయితే ఆయన పై టిడిపి అభ్యర్థిగా తమ్ముడు కేసినేని చిన్ని పోటీ చేసి గెలిచారు. దీంతో క్రియాశీలక రాజకీయాలకు గుడ్ బై చెబుతున్నట్లు కేశినేని నాని ప్రకటించారు. అయితే విజయవాడలో పోటీ చేస్తున్న వారంతా ఇలా రాజకీయాలకు గుడ్ బై చెప్పడం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సెంటిమెంట్ గా మారింది. అక్కడ పోటీ చేసేందుకు ఎవరు ముందుకు రాని పరిస్థితి నెలకొంది.

# మరో వివాదంలోమంచు ఫ్యామిలీ



**తిరుపతి :** మంచు మోహన్ బాబు, మంచు విష్ణు మరోసారి వార్తల్లోకి ఎక్కారు. తిరుపతి లో మోహన్ బాబు యూనివర్సిటీ వద్ద ధర్నా చేస్తున్న ఎస్ ఎఫ్ ఐ సంఘం వాళ్ళను కిడ్నాప్ చేయించారని మోహన్ బాబు, మంచు విష్ణు, సతీష్ లపై తిరుచానూరు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయ్యింది. రీసెంట్ గానే రేణిగుంట విమానాశ్రయం లో పోలీసులు సతీష్ ని అదుపులోకి తీసుకున్నారు. మరి ఇప్పుడు మోహన్ బాబు, మంచు విష్ణులను కూడా అదుపులోకి తీసుకుంటారో లేదో చూడాలి. పూర్తి వివరాల్లోకి వెళ్తే మోహన్ బాబు యూనివర్సిటీ లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని చాలా కాలం నుండి ఆరోపణలు వస్తున్న సంగతి తెలిసిందే. మోహన్ బాబు చిన్న తనయుడు మంచు మనోజ్ కూడా ఈ విషయం పై పెద్ద పోరాటమే చేసాడు. కొట్లాట వరకు వెళ్లి పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చింది.అయితే రీసెంట్ విద్యార్థి సంఘాలు కూడా మోహబ్ బాబు యూనివర్సిటీ ఎదుట ధర్నాలు చేయడం మొదలు పెట్టాయి. విద్యార్థుల నుండి అన్యాయంగా అధిక ఫీజులు వసూలు చేసారని, తక్షణమే వాళ్లకు ఆ ఫీజులను తిరిగి చెల్లించాలని నేతలు డిమాండ్ చేశారు. దీంతో ఆగ్రహించిన మోహన్ బాబు తన బౌన్సర్ల చేత వాళ్ళను కిడ్నాప్ చేయించినట్టు తెలుస్తోంది. కారులో వచ్చిన మోహన్ బాబు బౌన్సర్లు సినీ ఫక్కీలో విద్యార్థుల సంఘాల నేతలను ఎక్కించుకొని, మోహన్ బాబు ఫామ్ హౌస్ లో బంధించారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే మోహన్ బాబు ఫామ్ హౌస్ కి వెళ్లి విద్యార్థుల సంఘం నేతలను విడిపించి బౌన్సర్లను అరెస్ట్ చేశారు. ఈ ఘటనకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియా లో బాగా వైరల్ అయ్యాయి. అయినప్పటికీ ఈ వ్యవహారం పై మోహన్ బాబు ఎలాంటి రెస్పాన్స్ కూడా ఇవ్వలేదు.విద్యార్థుల నుండి అక్రమంగా వసూలు చేసిన అదనపు ఫీజులను తిరిగి చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ మోహన్ బాబు పట్టించుకోకపోవడం తో విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు.ఈ నేపథ్యం లో వాళ్ళ బాధను అర్థం చేసుకున్న ఎాఈఎ సంఘం, మరియు ఇతర విద్యార్థుల సంఘాలు యూనివర్సిటీ వద్ద ధర్నా చేపట్టి విద్యార్థుల బాధని మోహన్ బాబు కి అర్థం చేసే ప్రయత్నం చేశారు. అలాంటి వాళ్లకు సర్దిచెప్పి పంపాల్సింది పోయి, అహంకారంతో ఇలా కిడ్నాప్ చేయడం అమానుషం అంటూ సోషల్ మీడియా లో నెటిజెన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

## 140 మీటర్ల వెడల్పుతోనే అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు

ఓఆర్ఆర్ (అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు) భూసేకరణ విషయంలో కొద్ది రోజులుగా రైతులు ఆందోళన చెందుతున్నారు. 140 మీటర్ల వెడల్పుతో రహదారి నిర్మిస్తారని ప్రతిపాదనల్లో ఉంటే గెజిట్ నోటిఫికేషన్‌లో 250 మీటర్లుగా పేర్కొనడంతో వారిలో అలజడి మొదలైంది. అధికారుల చుట్టూ తిరుగుతూ ఫిర్యాదులు చేస్తున్నారు. ఆందోళనలకూ సిద్ధమయ్యారు. ఇది ముందు జాగ్రత్త కోసమేననీ 140 మీటర్ల వెడల్పుతోనే ఓఆర్ఆర్ నిర్మిస్తామని అధికారులు స్పష్టత ఇస్తున్నారు.

**3ఏ నోటిఫికేషన్ ప్రక్రియ పూర్తవకుండా**

సాధారణంగా 3ఏ నోటిఫికేషన్ ప్రక్రియ పూర్తవకుండా భూమి సర్వేకు అధికారులకు హక్కు ఉండదు. దీంతో కొలతలు తీసి సరిహద్దులు వేయలేరు. జీపీఎస్‌పై ఆధారపడాల్సిందే, ఆందోళన అవసరం లేదు. 140 మీటర్ల వెడల్పును జీపీఎస్ ప్రామాణికంగా తీసుకుని సరిహద్దులు నిర్ధారిస్తే క్షేత్ర స్థాయిలో కొన్నిచోట్ల 5-10 మీటర్లు తేడా వచ్చే వీలుంది. ఇలాగైతే ప్రక్రియ మళ్లీ మొదటి నుంచి చేయాల్సిందే. దీంతో ప్రాజెక్టు మరో ఏడాది ఆలస్యం అవుతుంది. ఈ సమస్య రాకుండా ముందు జాగ్రత్తగా నోటిఫికేషన్‌లో 250 మీటర్లని ప్రస్తావించారు. అభ్యంతరాల ప్రక్రియ పూర్తయి సర్వే చేశాక 140 మీటర్లకే క్షేత్రంలో కొలత వేసి సరిహద్దులు నిర్ణయించి ఆ మేరకే భూమి తీసుకుంటారు. ఈ విషయం తుది నోటిఫికేషన్‌లో పొందుపరుస్తారు

**అన్నదాతల కలవరం**

ఓఆర్ఆర్ నిర్మాణానికి కంచికచర్ల, వీరులపాడు, జి.కొండూరు, మైలవరం మండలాల్లో 18 గ్రామాల్లో 1,798 సర్వే నంబర్లలో 1,416.31 హెక్టార్లు సేకరించనున్నారు. జనవరి 5న విడుదలైన గెజిట్ నోటిఫికేషన్‌లో 140కు బదులుగా 250 మీటర్ల భూసేకరణ అని ఉంది. 140 మీటర్లే ఎక్కువనీ, 250 మీటర్లు తీసుకుంటే నష్టపోతామనీ, విలువైన పంటలు పండే భూమి కోల్పోయి జీవనోపాధి ప్రశ్నార్థకం అవుతుందని రైతులు వాపోతున్నారు. గ్రామసభలు, ప్రజా విచారణ చేపట్టకుండా, భూ యజమానులను సంప్రదించకుండా నిర్ణయించారని చెబుతున్నారు. ప్రారంభంలో ఈ రింగ్ రోడ్ 70 మీటర్ల వెడల్పుతో: ప్రారంభంలో ఈ రింగ్ రోడ్ 70 మీటర్ల వెడల్పుతో ఉండాలని మోర్త్ ఎలైన్‌మెంట్ అప్రూవల్ కమిటీ ఆమోదం తెలిపింది. ఆ ప్రణాళిక ప్రకారం ప్రాజెక్టు ఖర్చు రూ.16,310 కోట్లుగా నిర్ణయించారు. ఇందులో సివిల్ పనులకు రూ.12,995 కోట్లు, 1,702 హెక్టార్ల భూసేకరణకు రూ.2,665 కోట్లు, 124 హెక్టార్ల అటవీ భూముల సేకరణకు రూ.150 కోట్లు, పర్యావరణ అనుమతులకు రూ.200 కోట్లు, ఇతర వ్యయాలకు రూ.300 కోట్లు కేటాయించారు.

**ఇరువైపులా సర్వీసు రోడ్లు**

ఎలైన్‌మెంట్ అప్రూవల్ కమిటీ ఓఆర్ఆర్‌కు అనుమతిచ్చినప్పుడు కేవలం లోపలివైపు (రాజధాని ప్రాంతంవైపు) మాత్రమే సర్వీస్ రోడ్డు నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ఓఆర్ఆర్‌కు బయటివైపు అవసరం లేదని పేర్కొంది. అప్పుడు దీనిపై సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రితో చర్చించారు. ఇరువైపులా సర్వీసు రోడ్లు ఉంటేనే ఓఆర్ఆర్‌కు ఆనుకొని ఉండే గ్రామాలు, పట్టణాలకు చెందినవారు సులువుగా రాకపోకలు సాగించగలరని ఆయన పేర్కొన్నారు. దీంతో ఇరువైపులా సర్వీసు రోడ్ల నిర్మించనున్నారు.

## తిరుమల కల్తీ లడ్డూ వ్యవహారం ఏం చేద్దాం!

-మొదటిపేజీ తరువాయి

వచ్చారు. దీనికోసం అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. కిందిస్థాయిలో తెదేపా, జనసేన క్యాడర్ మధ్య చిచ్చుపెట్టేలా వైకాపా చేస్తున్న కుట్రలకు చెక్ పెట్టేలా పలు నిర్ణయాలు తీసుకున్నట్లు సమాచారం. త్వరలో ఖాళీ కానున్న 4 రాజ్యసభ స్థానాలపైనా చంద్రబాబు, పవన్ ప్రాథమికంగా చర్చించినట్లు తెలుస్తోంది. పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీపైనా సమావేశంలో చర్చ జరిగినట్లు తెలిసింది.

ముఖ్యమంత్రి చంద్రబాబును ఉండవల్లిలోని ఆయన నివాసంలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేడు ప్రత్యేకంగా కలిశారు. సీఎం - డిప్యూటీ సీఎంల ఏకాంత భేటీ రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దాదాపు రెండున్నర గంటల పాటు ఏకాంతంగా సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న తాజా రాజకీయ పరిణామాలపై వీరి మధ్య ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. కుల రాజకీయాలను రెచ్చకొడుతూ వైఎస్సార్సీపీ చేసే కుట్రలను కలసికట్టుగా ఎదుర్కొనే వ్యూహంపై ఇద్దరు అధినేతల భేటీలో చర్చించారు. పార్టీ ట్రాప్‌లో పడకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని నేతలిద్దరూ నిర్ణయానికి వచ్చారు. దీని కోసం అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ శ్రేణులు వైఎస్సార్సీపీ కుట్రల ఉచ్చులో పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల పైనా నేతల సమాలోచనలు జరిపారు. కింది స్థాయిలో తెలుగుదేశం-జనసేన క్యాడర్ మధ్య చిచ్చుపెట్టేలా వైఎస్సార్సీపీ చేస్తున్న కుట్రలకు ధీటుగా చెక్ పెట్టే దిశగా పలు నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. త్వరలో ఖాళీ కానున్న 4 రాజ్యసభ స్థానాలపైనా ఇరు పార్టీల అధినేతలు ప్రాథమికంగా చర్చించినట్లు సమాచారం. పెండింగ్ నామినేటెడ్ పదవుల భర్తీ పైనా ఇరువురు అధినేతలు ఓ అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

**వైఎస్సార్సీపీ నేతల ట్రాప్‌లో పడొద్దు**

మరోవైపు వైఎస్సార్సీపీ కుట్ర రాజకీయాల విషయంలో ఇప్పటికే టీడీపీ శ్రేణులను సీఎం చంద్రబాబు అప్రమత్తం చేశారు. వైఎస్సార్సీపీ నేతల ట్రాప్‌లో పడొద్దని నేతలను హెచ్చరించారు. అలాగే ఫిబ్రవరి 2న జరిగిన జనసేన కార్యవర్గ సమావేశంలో వైఎస్సార్సీపీ రాజకీయ కుట్రల గురించి వివరించిన పవన్ కల్యాణ్ జాగ్రత్తగా ఉండాలని పార్టీ నేతలను హెచ్చరించారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై ఇంత జరుగుతున్నా చాలామంది మాట్లాడటంలేదని మండిపడ్డారు. వైఎస్సార్సీపీ తప్పుడు ప్రచారాన్ని ఎందుకు తిప్పి కొట్టడం లేదని నేతలను ప్రశ్నించారు. మహిళల విషయాలలో చాలా జాగ్రత్తగా ఉండాలని, ఆడపిల్లలకు తమ చేయి తగిలినా రేప్ చేశారని ప్రచారం చేస్తారన్నారు. అన్నింటికీ తానే మాట్లాడితే ఇక ఎమ్మెల్యేలు, మంత్రులు, పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యులు ఎందుకని ప్రశ్నించారు.

**త్వరలో 32 మందితో క్రమశిక్షణ కమిటీ**

నేతలను వారి కుటుంబ సభ్యులను ఇష్టం వచ్చినట్టు మాట్లాడతారని జాగ్రత్తగా ఉండాలని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. సిద్ధాంత, సబ్జెక్ట్ పరంగా మాట్లాడాలని సూచించారు. త్వరలో 32 మందితో క్రమశిక్షణ కమిటీ ఏర్పాటు చేస్తామన్న పవన్ జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీలో మార్పులు చేస్తామన్నారు. వ్యక్తిగత వ్యవహారాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, తమ వల్ల పార్టీకి నష్టం కలుగుతుందని పవన్ అన్నారు. శాంతి భద్రతల సమస్యలు రాకుండా చూడాలన్న అధినేత భౌతిక దాడులు జనసేన విధానం కాదన్నారు. విమర్శలకు విషయంతోనే సమాధానం చెబుదామన్నారు.

## వ్యవసాయ శాఖకు అదనపు నిధులు కేటాయించండి

-మొదటిపేజీ తరువాయి



చర్చించారు. రైతుల ఆదాయం పెంపు, వ్యవసాయ ఉత్పాదకత వద్ధి, ఆధునిక సాంకేతికత అమలు, పశు సంవర్ధక రంగ విస్తరణ వంటి అంశాలకు బడ్జెట్‌లో ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆర్థిక మంత్రికి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా వ్యవసాయ, అనుబంధ శాఖల పరిధిలో ముఖ్యమైన కార్యాలయ భవనాలు, మౌలిక వసతుల నిర్మాణం, కొనసాగుతున్న మరియు ప్రతిపాదిత ప్రాజెక్టుల అమలుకు అదనపు నిధులు అవసరమని వివరించారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ మరియు అనుబంధ శాఖల కోసం అదనపు బడ్జెట్ కేటాయింపులు చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. ఈ విజ్ఞప్తిపై ఆర్థిక మంత్రి శ్రీ పయ్యావుల కేశవ్ గారు సానుకూలంగా స్పందిస్తూ, రైతు సంక్షేమం, వ్యవసాయ, పశుసంవర్ధక రంగాల అభివద్ధికి కూటమి ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యత ఇస్తుందని భరోసా ఇచ్చారు. రాబోయే బడ్జెట్‌లో ఈ రంగాలకు తగిన నిధులు కేటాయించే దిశగా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా కొలుసు మోహన్ యాదవ్ నియామకం

- వైయస్ జగన్ ను మళ్లీ సీఎం చేయడమే లక్ష్యం
- కొలుసు మోహన్ యాదవ్

**అంకుశం న్యూస్ విజయవాడ ఫిబ్రవరి 3:** రాష్ట్రంలో మళ్లీ వైయస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా పార్టీ అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని పార్టీ తనపైన నమ్మకంతో రాష్ట్రస్థాయిలో పదవి ఇచ్చినందుకు పార్టీకి ఎప్పుడు రుణపడి ఉంటానని నూతన వైఎస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి కొలుసు మోహన్ యాదవ్ అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీ రాష్ట్ర కమిటీలో నూతన నియామకాలు చేపట్టారు. ఇందులో భాగంగా గన్నవరం నియోజకవర్గానికి చెందిన కీలక నాయకుడు కొలుసు మోహన్ యాదవ్ ను పార్టీ "రాష్ట్ర కార్యదర్శి (అనుబంధ విభాగాలు)" గా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.పార్టీ ఆవిర్భావం నుండి క్రమశిక్షణ గల నాయకుడిగా మెలుగుతూ,



గన్నవరం నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి మోహన్ యాదవ్ చేసిన కృషిని అధిష్టానం గుర్తించింది. ముఖ్యంగా వెనుకబడిన వర్గాల సమస్యలపై పోరాడటంలో, అనుబంధ విభాగాల సమన్వయంలో ఆయన చూపిన చొరవకు గుర్తింపుగా ఈ రాష్ట్ర స్థాయి పదవిని కేటాయించారు.

**జగన్ ఆశయ సాధనే లక్ష్యం కొలుసు మోహన్ యాదవ్:**

తన నియామకంపై కొలుసు మోహన్ యాదవ్ స్పందిస్తూ.. తనపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతను అప్పగించిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అనుబంధ విభాగాలైన యువజన, విద్యార్థి, కార్మిక విభాగాలను రాష్ట్రవ్యాప్తంగా మరింత బలోపేతం చేస్తామని, ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు.

**హర్షం వ్యక్తం చేసిన పార్టీ శ్రేణులు:**

మోహన్ యాదవ్ నియామకం పట్ల కృష్ణా జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. గన్నవరం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. ఈ నియామకంతో పార్టీలో కొత్త ఉత్సాహం నెలకొందని, రానున్న రోజుల్లో పార్టీ కార్యకలాపాలు మరింత వేగవంతం అవుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆంధ్రప్రదేశ్ రైల్వే అభివృద్ధి కై ప్రత్యేక నిధులు ఇవ్వాలి

- రాష్ట్రపతి ప్రసంగ ధన్యవాద తీర్మానానికి ఎంపీ కేశినేని శివనాథ్ మద్దతు

**అంకుశం ప్రతినిధి ఢిల్లీ డిసెంబర్ 4:** భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగంపై లోక్ సభలో బుధవారం ప్రవేశపెట్టిన ధన్యవాద తీర్మానానికి ఎంపీ కేశినేని శివనాథ్ సంపూర్ణ మద్దతు తెలిపారు. రాష్ట్రపతి ప్రసంగం దేశం దేశం మౌలిక వసతుల ఆధారిత అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందనే అంశం ప్రతిబింబిస్తోందన్నారు. ఈ మేరకు ఎంపీ కేశినేని శివనాథ్ ప్రసంగం (లెడ్ ఆన్ ది టెబుల్) సభకు దాఖలు చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దూరదృష్టి గల నాయకత్వంలో రైల్వే రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయని, రికార్డు స్థాయి పెట్టుబడులు, వేగవంతమైన ప్రాజెక్టుల అమలు, ఆధునీకరణ చర్యలతో దేశవ్యాప్తంగా అనుసంధానం త్వరగా అవుతుందని ఎంపీ కేశినేని శివనాథ్ ప్రశంసించారు. భారతీయ రైల్వే సంస్థ నేడు దేశ అభివృద్ధికి ప్రతీకగా నిలుస్తోందని, రైల్వే నెట్‌వర్క్ విస్తరణ, విద్యుదీకరణ, డబ్లింగ్, స్టేషన్ పునరాభివృద్ధి వంటి చర్యలు ప్రయాణికుల సౌకర్యంతో పాటు వాణిజ్యం, పర్యటన, ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేస్తున్నాయని తెలిపారు. లాజిస్టిక్స్ ఖర్చులు తగ్గటంతో పాటు, చివరి మైలు అనుసంధానం కూడా మెరుగుపడిందన్నారు.



అలాగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయంతో పనిచేస్తూ రైల్వే ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అనుమతులు, కావాల్సిన సహకారం అందిస్తోందని ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. ఈ సహకార ఫెడరలిజం భావనే మౌలిక వసతుల సకాలంలో అమలుకు కీలకమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన కొన్ని ముఖ్యమైన రైల్వే అంశాలను కూడా ఎంపీ ప్రస్తావించారు. వ్యవసాయం, ఎరువుల రవాణా, పరిశ్రమల లాజిస్టిక్స్‌కు మద్దతుగా రాష్ట్రంలో కొత్త రైల్‌హెడ్‌ల మంజూరు చేయాలని, అలాగే అమరావతితో పాటు ఇతర అభివృద్ధి కేంద్రాలకు కొత్త రైల్వే మార్గాల కోసం సర్వేలు, అనుమతులను వేగవంతం చేయాలని కోరారు.

స్టేషన్ ఆధునీకరణ పనులను సమయానికి పూర్తిచేస్తే ప్రయాణికులకు మరిన్నీ సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని,, రాష్ట్రంలోని ప్రాంతీయ అనుసంధానం బలపడుతుందని తెలిపారు. ఈ ప్రతిపాదనలు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగంలో పేర్కొన్న జాతీయ మౌలిక వసతుల దృష్టికి పూర్తిగా అనుగుణంగా ఉన్నాయని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు.

# అనంతలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

- మొత్తం 50 మందికి 63 లక్షల రూపాయల చెక్కులు అందజేత
- 19 నెలల్లో 452 మందికి రూ.4.86 లక్షలు అందించాం.. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

**అంకుశం న్యూస్ అనంతపురం ఫిబ్రవరి 4:** ముఖ్యమంత్రి చంద్రబాబు చేసేదే చెబుతారు.. చెప్పిందే చేస్తారని.. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అర్బన్ టిడిపి కార్యాలయంలో ఆయన ఇవాళ సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. మొత్తం 50 మందికి 63 లక్షల రూపాయల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు. కష్ట సమయంలో ఆదుకున్నారని లబ్ధిదారులు ఎమ్మెల్యే దగ్గుపాటికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా దగ్గుపాటి ప్రసాద్ గారు మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేనివిధంగా అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా పేదలను ఆదుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 452 మందికి రూ. 4.86 లక్షలు అందించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఇందులో మైనార్టీలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చామన్నారు. వైసిపి హాయంలో ఎప్పుడు ఇలాంటి సాయం అందలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల ఆరోగ్యం పట్ల ప్రత్యేకంగా చొరవ చూపుతున్నారన్నారు.



మరోవైపు ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తున్నారన్నారు. పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్లు, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి పథకాలను చెప్పిన మాట ప్రకారం అమలు చేస్తున్నామన్నారు. ప్రపంచం మొత్తం ఏపీ వైపు చూసే విధంగా నేడు పెట్టుబడులు వస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో గూగుల్ వంటి సంస్థలు కూడా ఏపీకి వచ్చాయన్నారు. ఓవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. హంద్రీనీవా కాలువను కేవలం 100 రోజుల్లోనే వెడల్పు చేసి 40 టీఎంసీల మేర నీరు తీసుకువచ్చారన్నారు. రానున్న రోజుల్లో మరికొంత నీరు వచ్చే అవకాశం ఉందన్నారు. జిల్లాను హార్టికల్చర్ హబ్ గా మార్చడంతో పాటు కొన్ని పరిశ్రమలు కూడా తీసుకొస్తున్నారని చెప్పారు. ఇది పేదల పక్షాన నిలబడుతున్న ప్రభుత్వం అని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు.

# చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించే దిశలో కృషి చేయాలి..

**అంకుశం న్యూస్ ధర్మవరం ఫిబ్రవరి 4:** చేనేత పరిశ్రమను కాపాడుకుంటూ చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించే దిశలో ప్రతి ఒక్కరు కృషి చేయాలని చేనేత నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని చేనేత సంఘం నాయకురాలు, బీసీ సంక్షేమ మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీమతి సంకారపు జయశ్రీ బుధవారం తన స్వగృహంలో సమావేశాన్ని నిర్వహించారు.. ఈ సందర్భంగా ఫిబ్రవరి 22 రాజకీయాలకు అతీతంగా ఐక్య చేనేత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళగిరి లో జరిగే చేనేత గర్జన పై చేనేత నాయకులు అనేక విషయాలు చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా చేనేత నాయకులు మాట్లాడుతూ కనుమరుగు అవుతున్న చేనేత పరిశ్రమను, చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ చేనేత గర్జన ద్వారా పలువిషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని



నాయకులు నిర్ణయించుకున్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన నేతన్న భరోసా రూ. 25 వేల రూపాయలు వెంటనే అమలు పరచాలని, అదే విదంగా చేనేత పై జివిఎస్టి ని పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలనీ,చేనేత సహకార సంఘాలకు ప్రభుత్వం చెల్లించవలసిన 203 కోట్ల రూపాయల బకాయిలను తక్షణమే చెల్లించాలని తెలిపారు.ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఉపాధిని కోల్పోయిన చేనేత కార్మికులకు రూ. 10 వేలు ఆర్ధిక సహాయాన్ని అందించాలని, నేతన్నలందరికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని వెంటనే అమలు చేయాలని తదితర డిమాండ్ల సాధనకై ఫిబ్రవరి 22న మంగళగిరిలోని నేతన్న సర్కిల్ వద్ద జరగనున్న చేనేత గర్జనలో చేనేత కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిర్రాజు రవి, బుడగ వెంకటనారాయణ, నీలూరి శ్రీరాములు, పోలావెంకటనారాయణ, యుగంధర్,పల్లా నవీన్, గిర్రాజు శశి,దాసరి శ్రీనివాసులు, గడ్డం పార్థసారధి,కోనేటి వెంకటేష్, భాస్కర, గుర్రం వెంకటస్వామి జల్లా కార్తీక్,తదితరులు పాల్గొన్నారు.

## ధర్మవరం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల కు ఇన్వెర్టర్ అందజేత...

**అంకుశం న్యూస్ ధర్మవరం ఫిబ్రవరి 4:** ధర్మవరం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల లో కంప్యూటర్ విభాగం కోసం ఇన్వెర్టర్ ను పట్టు చేనేత రంగానికి చెందిన చేనేత ప్రముఖులు కోటం పార్థసారధి కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ మతి ఎమ్ వనిత వాణి కి అందజేశారు. ఆమె ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ 25 వేలు విలువ కల ఈ ఇన్వెర్టర్ వలన కళాశాల కంప్యూటర్ విభాగానికి ఎంతో ప్రయోజనం అన్నారు.దాత కోటం పార్థసారధి కి కళాశాల తరుపున కృతజ్ఞతలు తెలియజేసారు ఇంకా ఈ కార్యక్రమం లోకాలేజీ అభివృద్ధి కమిటీ తరుపున బండి వేణుగోపాల్, మహిళా లెక్చరర్లు, శాంతి, వనిత, చంద్ర కళ అరుణ, మునుస్వామి నాయుడు, రామాంజన రెడ్డి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.




## పట్టుదల, కృషితో ఉన్నత శిఖరాలకు చేరువ

**రాప్తాడు అంకుశం న్యూస్ ఫిబ్రవరి 4:** విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని కృషి పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని అనంతపురం జేఎన్‌టీయూఏ పులివెందుల గణితశాస్త్ర విభాగ ప్రొఫెసర్ డాక్టర్ జి. శంకర్ శేఖర్ రాజు అన్నారు. హంపాపురం సమీపంలోని ఎస్.వి.ఐ.టి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదల కాగా . ఈ ఫలితాలను ప్రొఫెసర్ డాక్టర్ జి. శంకర్ శేఖర్ రాజు చేతుల మీదుగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుపై విద్యార్థులు చూపిన కృషి, నిబద్ధత, పట్టుదల ప్రశంసనీయమని, వారి అకడమిక్ ప్రయాణం మరింత విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సెమిస్టర్‌ను విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులందరికీ కళాశాల కరస్పాండెంట్ వి.బీ.ఆర్. శర్మ, చైర్మన్ శ్రీ బీ.వి.కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ వెన్నెపూస రవీంద్ర రెడ్డి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఎండీ వెన్నెపూస రమాకాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ టి. విష్ణువర్ధన్, పరీక్షల విభాగాధిపతి జి.శ్రావణి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ శ్రీ ఎన్. ఫణిరాజా రావు, హెచ్ అండ్ ఎస్ విభాగాధిపతి డాక్టర్ ఏ. చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



## స్పందన హాస్పిటల్ లో చర్మవ్యాధుల ప్రత్యేక వైద్య నిపుణులు సేవలు ప్రారంభం.! డాక్టర్ బషీర్, డాక్టర్ సోనియా.

**అంకుశం న్యూస్ ధర్మవరం ఫిబ్రవరి 4:** పట్టణంలోని సాయిబాబా గుడి వద్ద గల స్పందన చర్మవ్యాధుల ప్రత్యేక వైద్య నిపుణుల సేవలు ప్రారంభించడం జరిగిందని హాస్పిటల్ అధినేత డాక్టర్ బషీర్, డాక్టర్ సోనియా తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ మేటిమలు, పులిపిర్లు, వెంట్రుకలు రాలుట, మంగు, మచ్చలు, ఎగ్జిమా, దురద, స్కిన్ ఎలర్జీ, దద్దుర్లు, సోరియాసిస్, బొల్లి, ఫంగల్ ఇన్ఫెక్షన్లు, సుఖ వ్యాధులకు ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ మంజీరాచే వైద్య చికిత్సలు, పాటించాల్సిన పద్ధతులను కూడా తెలపడం జరుగుతుందన్నారు. పులిపిర్లు, ఆనెలు నొప్పి లేకుండా ప్రత్యేక పరికరంతో తొలగించడం జరుగుతుందన్నారు. ఈ సేవలు వినియోగించుకునేవారు మధ్యాహ్నం 12:30 నుండి 2 గంటల వరకు, తిరిగి సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు సేవలు అందిస్తారని తెలిపారు. కావున పట్టణ గ్రామీణ ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



## క్యాన్సర్ వ్యాధిని ముందుగా గుర్తించండి

- రిటైర్డ్ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ సంకారపు నరసింహులు.

**అంకుశం న్యూస్ ధర్మవరం ఫిబ్రవరి 4:** క్యాన్సర్ వ్యాధిని ముందుగా గుర్తించాలని రిటైర్డ్ కంటి వైద్య నిపుణులు డాక్టర్ సంకారపు నరసింహులు తెలిపారు. ఈ సందర్భంగా వారు ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ప్రజలకు కొన్ని విషయాలను తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నేడు ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ మరణాలు అధికమవుతున్నాయని, దీనికి ముఖ్య కారణం వ్యాధిని ముందుగా గుర్తించాలని, అదేవిధంగా చికిత్స పొందకపోవడమేనని వారు స్పష్టం చేశారు. ప్రజలు కూడా క్యాన్సర్ పట్ల అవగాహన కల్పించడానికి ఈ ప్రయత్నం చేయడం జరుగుతుందని తెలిపారు. ముందస్తుగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించుకోవాలని తెలిపారు. పురుషులలో నోరు, గొంతు, ఊపిరితిత్తులు క్యాన్సర్ గా వస్తాయని, అదే మహిళలకు అయితే రొమ్ము, గర్భాశయ ముఖ ద్వారం వద్ద క్యాన్సర్ వస్తాయని తెలిపారు. అంతేకాకుండా పురుషులలో పొగాకు నమలుట, బీడీ, సిగిరెట్ కాల్చుట ముఖ్య కారణమైతే, స్త్రీలలో సంతానానికి సంబంధించిన సమస్యలు ముఖ్యమైనవి అని తెలిపారు. దీర్ఘ కాలముగా జ్వరము, విపరీతముగా బరువు తగ్గుట, ఆకలి మందలించుట లాంటివి సాధారణ క్యాన్సర్ లక్షనములు అని తెలిపారు. కావున ప్రజలు క్యాన్సర్ పట్ల అప్రమత్తమై ముందస్తు పరీక్షలు నిర్వహించుకుని, తొందరగానే గుర్తించి, చికిత్స పొందితే క్యాన్సర్ను త్వరగా నియంత్రించవచ్చునని వారు తెలిపారు.




## తిరుమల లడ్డు కల్తీ చేయలేదని వైసీపీ వాళ్లు చెప్పడం సిగ్గుచేటు. జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి.

**అంకుశం న్యూస్ ధర్మవరం ఫిబ్రవరి 4 :** తిరుమల లడ్డు కల్తీ చేయలేదని వైసీపీ వాళ్లు చెప్పడం సిగ్గుచేటని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూధన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు జనసేన పార్టీ కార్యాలయం లో పత్రికా విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల వైసీపీ వాళ్ళు తిరుమల లడ్డులో కల్తి నెయ్యి చేయలేదని అసత్య ఆరోపణలు చేస్తున్నారని, కల్తీ చేయకపోతే వాళ్లు అలిపిరి మెట్ల దగ్గర ప్రమాణం చేసేకి సిద్ధంగా ఉన్నారా అంటూ సవాల్ విసిరారు. అదేవిధంగా కల్తీ చేశారని ప్రమాణం చేసేకి మేము సిద్ధంగా ఉన్నామని మీరు చేసిన కల్తి నెయ్యి దోపిడీని బట్టబయలు చేశామని స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై లేనిపోని ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోమని వారు హెచ్చరించారు. తిరుమల కల్తీ లడ్డు వాస్తవం అని ఇప్పటికైనా ఒప్పుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని వారు హితవు పలికారు. అదేవిధంగా తిరుమల దేవస్థానంలో గత ప్రభుత్వ హయంలో శ్రీవారి లడ్డు తయారీలో నెయ్యకు బదులు రసాయానాలతో కూడిన సింథటిక్ పదార్థాలు కలిపి నెయ్యి తో కల్తీ లడ్డూలను తయారు చేసి, భక్తుల మనోభావాలను దెబ్బతీశారని వారి మండిపడ్డారు. వెంకటేశ్వర స్వామి భక్తులను, హిందువులను హిందూ సాంప్రదాయాలను, తిరుమల లడ్డును వైసీపీ వాళ్ళు అపవిత్రం చేశారని, ఇటీవల సిట్ దర్యాప్తులో లడ్డు తయారీలో ఒక్క చుక్క ఆవు పాలు లేకుండా, వినియోగించారని కుండబద్దలు కొట్టినట్టు చెబుతున్నప్పటికీ, వైసీపీ శ్రేణులు దీన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని వారు మండిపడ్డారు.తిరుమల లడ్డు ప్రసాదం కోసం వైసీపీ హయాంలో నెయ్యి సరఫరా కాంట్రాక్టులో తీవ్రవనీతి, అధర్మ చర్యలు చోటు చేసుకున్నాయని తెలిపారు. వైసీపీ పాలనలో అన్ని శాఖల మంత్రిగా ఉన్న సభ్యుల రామకృష్ణారెడ్డి ఇప్పుడు కల్తీ సహజమే అని చెబుతున్నారు అంటే వీళ్ళకి ప్రజల మీద చట్టం మీద, ధర్మం మీద కనీస గౌరవం బాధ్యతలు అస్సలు లేవని స్పష్టమైంది అన్నారు.అదేవిధంగా రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వ్యక్తిగత అంశాలను పార్టీకి రుద్దడం సరికాదని అది ఆయన వ్యక్తిగత విషయం అయినప్పటికీ ఆయన్ను పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనవద్దని పార్టీ అధిష్టానం తెలియజేసిందని తెలిపారు. ఈ మొత్తం వ్యవహారాన్ని త్రిసభ్య కమిటీ పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.ఈ కార్యక్రమం లో ఆయన వెంట కొత్త పేట జనసేన నాయకులు కోటిరెడ్డి రాజారెడ్డి తదితరులు వున్నారు.



# యూట్యూబ్ జర్నలిస్టులకు సోషల్ మీడియా సభ్యులకు " బహుజన బందు " పురస్కారం చే సన్మానం!

- ఏప్రిల్ 11 న అనంత రిజర్వేషన్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కార్యక్రమం
- రిజర్వేషన్ పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షులు డా. పోతుల నాగరాజు



**అంకుశం న్యూస్ అనంతపురం ఫిబ్రవరి 4:** రాష్ట్రంలో, దేశంలో సోషల్ మీడియా పాత్ర చాలా గణనీయంగా పెరుగుతుంది. కారణం ప్రధాన పత్రిక లలోను. ఛానెల్ లలోను జరుగుతున్న వివక్ష,కుల తత్వం, అవినీతి, ఒక వర్గంకు, ఒక పార్టీకి, ఒక కులంకు, కొమ్ము కాస్తూ ప్రజల సంక్షేమము, అభివృద్ధి ని విస్మరించి కేవలం తమ ఆర్థిక అభివృద్ధి కోసం పాలక వర్గం తొత్తు గా పని చేస్తున్నాయి. అని పోతుల నాగరాజు అన్నారు. ఇలాంటి తరుణంలో సమాజం కోసం మేము సైతం అంటూ జర్నలిజం పట్ల ఆసక్తి ఉన్న వారు, చదువు కొన్న వారు, వాస్తవ విషయాలు తెలియ చేయాలని తపన ఉన్న వారు యూ ట్యూబ్ ఛానెల్ ను ఏర్పాటు చేసుకొని నిరంతరం సమాజం లో పని చేస్తున్నారు. వీరు తమ సొంత ఖర్చులతో ప్రయాణం చేస్తున్నారు. ఇలాంటి వారికీ తమ వంతు బాధ్యత గా ఒక చిన్న ప్రయత్నం మేము చేస్తున్నాము. అని పోతుల నాగరాజు అన్నారు

నిజాయితీగాను, నిష్పక్ష పాతంగాను, పేదల సమస్య లపైన, బహుజన సమాజం పైన, చదువు కొన్న వారి కోసం, రైతుల పక్షాన పని చేస్తున్న, సమస్యల పరిష్కారం కోసం తమ వంతు బాధ్యత గా కృషి చేస్తున్న యూ ట్యూబ్ ఛానల్ సభ్యులను గుర్తించి వారికి "బహుజన బందు "పురస్కారం అందచేయడం జరుగుతుంది. అని పోతుల నాగరాజు వివరించారు

ఈ కార్యక్రమంను రిజర్వేషన్ల పరిరక్షణ సమితి (RPS )మరియు రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (REF ) మహాత్మా పూలే చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టడం జరుగుతుంది.

ఈ పురస్కారం కోసం ఉమ్మడి జిల్లాలు అనంతపురం, కడప, ,కర్నూల్, చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లా లలో పని చేస్తున్న సోషల్ మీడియా ఛానల్ మిత్రులు మార్చి 25 వ తేది లోపుగా ఈ నెంబర్ లకు తమ ఛానల్ వివరాలు నమోదు చేసుకో వలసినది గా విజ్ఞప్తి : 9949928999, 9182018677, 8309475846 నెంబర్లకు వివరాలు పంప వలసినదిగా తెలుపుచున్నాము.

# మైనార్టీలకు కాంగ్రెస్ అండగా ఉంటుంది





- పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల
- అనంతలో వైయస్ షర్మిలకు దాదా గాంధీ మైనార్టీల ఆధ్వర్యంలో ఘన సన్మానం

**అంకుశం న్యూస్ అనంతపురం ఫిబ్రవరి 4** :దేశంలో రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమం కోసం మైనార్టీల అభివృద్ధి కోసం పని చేసిన ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని మైనార్టీలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలన్నదే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీలో అన్ని విధాలుగా మైనార్టీలకు న్యాయం చేస్తామని పిసిసి అధ్యక్షులు వైయస్ షర్మిల అన్నారు నగరంలో మైనార్టీ నాయకులు దాదా గాంధీ ఇతర మైనార్టీ నాయకులు ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా పర్యటనకు వచ్చిన పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా వైఎస్ షర్మిల మైనార్టీలను ఉద్దేశించి మాట్లాడారు రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి వైయస్ షర్మిలమ్మ గారి ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర పర్యటన అనంతపూర్ జిల్లాలో విజయవంతమైన సందర్భముగా హోటల్ మాసినేని గ్రాండ్ నందు రాష్ట్ర మైనార్టీ అధ్యక్షులు నవాబ్ శాలి దాదా గాంధీ అధ్యక్షతన మరియు మౌలానా చిస్తీ వుల్ ఖాద్రీ సాహెబ్ వారి యొక్క కుటుంబ సభ్యులతో రాష్ట్ర అధికార ప్రతినిధి నవాబ్ జాకీర్ హుస్సేన్ జిల్లా మైనార్టీ అధ్యక్షులు హనిగి శర్మాస్ వలి జిల్లా ఉపాధ్యక్షులు ఫిరోజ్ ఖాన్ మైనార్టీ జిల్లా అధ్యక్షులు హనీగీ శర్మాస్ వలి మరియు 300 మంది ముస్లిం సోదరులతో రాష్ట్ర పిసిసి అధ్యక్షురాలు శ్రీమతి వైయస్ షర్మిలమ్మ గజమాలతో ఘనంగా సత్కరించి వీడుకోలు పలికారు మిగతా జిల్లాలు కూడా ఉపాధి హామీ పథకం పరిరక్షణ యాత్ర విజయవంతం కావాలని కోరడమైనది..ఈ కార్యక్రమంలో సింగనమల నియోజకవర్గం ఇన్చార్జ్ సాకేశంకర్ పార్టీ సీనియర్ నాయకులు కాపు గాజుల వాసు శివశంకర్ యాదవ్ ఓబీసీ జిల్లా అధ్యక్షులు రామ్ చరణ్ యాదవ్ ప్రసాద్ రెడ్డి నరసింహారెడ్డి రైతు విభాగం అధ్యక్షులు వై ఆర్ కృష్ణ రుద్రంపేట పంచాయతీ మైనార్టీ అధ్యక్షులు మోదిన్ భాష మైనార్టీ జిల్లా ఉపాధ్యక్షులు షఫీ శివారెడ్డి తదితరు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## నిత్యం దోమలు స్వైర విహారం పట్టించుకోని అధికారులు



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఫిబ్రవరి 03:** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛ భారత్,స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తున్న తరుణంలో అధికారులు మాత్రం ఆ దిశగా దృష్టి సారించడం లేదనే విమర్శలు తలెత్తుతున్నాయి. ఎండాకాలం, శీతాకాలం,వర్షాకాలం అనే తేడా లేకుండా నిత్యం దోమలు స్వైర విహారం చేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురౌతున్నారు. అనపర్తి మండలంలో రాత్రి పగలు అనే తేడా లేకుండా విజృంభిస్తుండటంతో వైరల్ జ్వరాలు,ఇతర వ్యాధులు ప్రబలి ఆసుపత్రి పాలు కావాల్సి వస్తుందని వేలకు వేలు ఖర్చు పెట్టవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రజలు తమ వ్యక్తిగతంగా ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా దోమకాటు నుండి తప్పించుకోలేకపోతున్నామని తమ బాధ వ్యక్తం చేస్తున్నారు.ఎన్ని జాగ్రత్తలు తీసుకున్న దోమల స్వైర విహారం ఆగడం లేదని గ్రామాల ప్రజలు వాపోతున్నారు. దోమల నివారణకు చర్యలు చేపట్టకపోవడంతో దోమల దండయాత్ర పెరిగిపోయిందని అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరైన విధానం కాదని కనీసం దోమల నివారణకు చేపట్టవలసిన ఏ ఒక్క చర్య మండల, పంచాయతీ స్థాయి అధికారులు పట్టించుకోకపోవడం వల్ల రోజు రోజుకి దోమల స్వైరవ్యహారం పెరిగిపోతుందని చీకటి పడితే చాలు బహిరంగ ప్రదేశంలో ఎక్కడా పట్టుమని పది నిమిషాలు కూడా నిలబడలేని పరిస్థితి ఏర్పడిందని ప్రజలు తీవ్ర ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయకపోవడం నివారణ మందు పిచికారి చేయకపోవడమే గాక కనీసం నామమాత్రపు చర్యలు కూడా చేపట్టకపోవడం పట్ల గ్రామాల ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రజా ఆరోగ్యంపై అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని ప్రజలు వాపోతున్నారు. దోమ కాటుతో డెంగ్యూ, మలేరియా వంటి ప్రమాదకర వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆందోళనకు గురవుతున్నారు.దోమల దండయాత్ర మరింత పెరగక ముందే అధికారులు చర్యలు చేపట్టి ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ముడి పొగాకు ఉత్పత్తులపై సున్నా ఎక్సైజ్ సుంకం

- పొగాకు రైతులకు, చిరు వ్యాపారులకు పెద్ద ఊరట - మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అంకుశం ప్రతినిధి అమరావతి, ఫిబ్రవరి 04:** బ్రాండ్ లేని ముడి పొగాకు ఉత్పత్తులపై ఎక్సైజ్ సుంకాన్ని సున్నా శాతానికి తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన గెజిట్ నిర్ణయాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వాగతిస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ నిర్ణయం రాష్ట్రంలోని పొగాకు రైతులు, చిరువ్యాపారులకు ప్రత్యక్షంగా లాభం చేకూరుస్తుందని పేర్కొన్నారు. పొగాకు టూ కోడ్ 2401 కిందకు వచ్చే, రీటైల్ విక్రయాల కోసం ప్యాక్ చేయని అన్ బ్రాండెడ్ ముడి పొగాకుపై ఇకపై ఎలాంటి ఎక్సైజ్ డ్యూటీ వర్తించదని తెలిపారు. గతంలో అస్పష్టమైన నిబంధనల వల్ల రైతులు, వ్యాపారులు ఎదుర్కొన్న ఇబ్బందులు ఈ గెజిట్‌తో తొలగిపోతాయని చెప్పారు. అయితే బ్రాండెడ్‌గా ప్యాక్ చేసిన పొగాకు ఉత్పత్తులపై 18 శాతం ఎక్సైజ్ సుంకం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో పన్నుల విషయంలో స్పష్టత, పారదర్శకత పెరుగుతాయని, రైతులకు మెరుగైన ధర లభించే అవకాశం ఉందని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఈ మార్పులతో ముడి పొగాకు సరఫరా వ్యవస్థకు ఉపశమనం లభిస్తుందని, ప్రభుత్వ ఆదాయానికి ఎలాంటి భంగం కలగదని మంత్రి స్పష్టం చేశారు. గతంలో ప్యాకింగ్, రీటైల్ విక్రయాలపై పన్ను వర్తింపుపై ఉన్న సందేహాలు ప్రస్తుత గెజిట్‌తో పూర్తిగా తొలగిపోయాయని మంత్రి తెలిపారు. బల్క్ ముడి పొగాకుపై ఎలాంటి పన్ను లేకపోవడం వల్ల రైతులకు నేరుగా లాభం చేకూరుతుందని, మెరుగైన ధర లభించే అవకాశం ఉందన్నారు. అలాగే బ్రాండెడ్ ఉత్పత్తుల పేరుతో జరిగే దుర్వినియోగానికి ఈ కొత్త మార్గదర్శకాలు అడ్డుకట్ట వేస్తాయని మంత్రి పేర్కొన్నారు.

# అనంత లో 6 వ తేదీ నుండీ జిల్లా పోలీస్ స్పోర్ట్స్ మీట్ నిర్వహణ

-- జిల్లా ఎస్పీ పి.జగదీష్

-- పోలీస్ స్పోర్ట్స్ మీట్ నిర్వహణపై సమావేశం



**అంకుశం క్రైమ్ న్యూస్ అనంతపురం ఫిబ్రవరి 4** జిల్లాలో ఈనెల 6 వ తేదీ నుండీ మూడ్రోజుల పాటు జిల్లా పోలీస్ స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ పి.జగదీష్ తెలిపారు. ప్రతిఏడాది నిర్వహించే ఈ స్పోర్ట్స్ మీట్ ను జిల్లాలో ఘనంగా ముగించాలనే సంకల్పంతో జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా నేతృత్వంలో జిల్లా పోలీస్ స్పోర్ట్స్ మీట్ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్పోర్ట్స్ మీట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది క్రీడల్లో చురుకుగా పాల్గొనడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉత్సాహం పెరుగుతుందని పేర్కొన్నారు. స్పోర్ట్స్ మీట్ సందర్భంగా వివిధ క్రీడా పోటీలు నిర్వహించడంతో పాటు పాల్గొనే సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, వైద్య సహాయం, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలపై దిశానిర్దేశం చేశారు. అలాగే, క్రీడా మైదానాల సిద్ధత, పోటీల నిర్వహణకు కమిటీల ఏర్పాటు, సమయపాలన వంటి విషయాలపై అధికారులకు బాధ్యతలు కేటాయించారు. స్పోర్ట్స్ మీట్‌ను క్రమబద్ధంగా, ఉత్సాహభరితంగా నిర్వహించాలని సమావేశంలో సూచించారు.


ఈ సమావేశంలో ఏ.ఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, పలువురు సి.ఐ లు, ఆర్ ఐ లు, ఆర్ ఎస్ ఐ లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## టీటీడీ ఈవోగా శ్రీకాకుళం జిల్లా వాసి ముద్దాడ రవిచంద్ర



తిరుమల : తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కార్యనిర్వహణ అధికారిగా సీనియర్ ఐఏఎస్ అధికారి ముద్దాడ రవిచంద్రను ప్రభుత్వం నియమించింది. ఆయనకు పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఈవోగా ఉన్న అనిల్ సింఘాల్ను బదిలీ చేశారు. శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలానికి చెందిన రవిచంద్ర. ప్రస్తుతం ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శిగా కీలక బాధ్యతల్లో ఉన్నారు.

## నూతన ఎస్ఐ గా భాద్యతలు స్వీకరించిన హనుమంతు



**.పోరుమామిళ్ల,ఫిబ్రవరి 04(అంకుశం పత్రిక):** మండల నూతన ఎస్ఐ గా పి.హనుమంతు బుధవారం ఉదయం భాద్యతలు స్వీకరించారు. ఈయన 2012 బ్యాచ్ కు చెందిన సబ్ ఇన్స్పెక్టర్. కడప జిల్లా ఎర్రగుంట్ల యుపిఎస్ నుంచి పోరుమామిళ్ల ఎస్ఐ గా బదిలీపై వచ్చారు. పోరుమామిళ్లలో పనిచేసిన కొండారెడ్డి బద్వేల్ యుపిఎస్ కు బదిలీపై వెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా నూతన ఎస్ఐ హనుమంతు మాట్లాడుతూ...పోరుమామిళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో మట్కా, జూదం, అక్రమ మద్యం లాంటి అసాంఘిక కార్యక్రమాలపై గట్టి చర్యలు ఉంటాయన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో మొదటి ప్రాధాన్యత ఉంటుందని, ఎవరైనా శాంతి భద్రతలకు భంగం కల్గిస్తే ఉపేక్షించేది లేదని అన్నారు. మండలంలో ఎక్కడయినా చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరుతున్నట్లు అనుమానం వస్తే ప్రజలు పోలీసులకు సమాచారం ఇచ్చి సహకరించాలన్నారు.

## ఓర్వకల్లు విమానాశ్రయానికి ఉయ్యాలవాడ నరసింహ రెడ్డి పేరు పెట్టాలి

- కేంద్ర మంత్రి కి ఎంపీ డాక్టర్ బైరెడ్డి వినతి.




కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

**అంకుశం న్యూస్ నంద్యాల్ ఫిబ్రవరి 4:** ఈనెల 22న జరిగే భారత స్వాతంత్ర్య తొలి పోరాట వీరుడైన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జయంతి సందర్భంగా, ఓర్వకల్లు విమానాశ్రయానికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విమానాశ్రయంగా అనే పేరును అధికారికంగా ప్రకటించాలని బుధవారం న్యూ ఢిల్లీలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్ మోహన్ నాయుడు ను కలిసి నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ బ్రిటిష్ పాలనకు ఎదురు నిలబడి ప్రాణాలర్పించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి త్యాగానికి ఇదే నిజమైన నివాళి అని కేంద్ర మంత్రికి వివరించారు.


## అభివృద్ధి ప్రధంలో దూసుకుపోతున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి

- అనపర్తి నియోజకవర్గం పరిధిలోని రోడ్లు కు మహార్ధశ



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఫిబ్రవరి 03:** అభివృద్ధే ఆయన లక్ష్యం అనుకున్నది సాధించడమే తన ధ్యేయం.ఎవరు చెప్పినా వినని మొండి తనం, తాను అనుకున్నది సాధించి తీరాల్సిందే.ఎవరేమి అనుకున్నా,ఎంతమంది వ్యతిరేకించిన తాను అనుకున్నది సాధించి సత్తా చాటడం.అదే మొండి తనం తనని రాష్ట్ర వ్యాప్త నాయకుడిని చేసింది.ఇంతకీ ఎవరును కుంటున్నారా?అదే అనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి.ఇక విషయంలోకి వెళితే 2024 ఎన్నికల్లో విజయం సాధిస్తే అనపర్తి రైల్వే స్టేషన్లో జన్మభూమి ఎక్స్ప్రెస్ కు హాల్ట్ తీసుకురావడం జరుగుతుందని హామీ ఇవ్వడం, సాధించి తీరడం తన పని తీరుకు అద్దం పడుతుంది.ఇప్పుడు మళ్ళీ రాష్ట్ర వ్యాప్తంగా రద్దీగా ఉండే 12 రోడ్ల విస్తరణలో కాకినాడ- రాజమహేంద్రవరం కెనాల్ రోడ్డు కూడా ఉండటం ఎమ్మెల్యే నల్లమిల్లి కృషి, పట్టుదలతో పాటు అభివృద్ధే లక్ష్యం అడుగులు వేయడం ఫలించడం గమనార్హం. ముఖ్యంగా కెనాల్ రోడ్డు వివరాల్లోకి వెళితే ఎన్నో ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కెనాల్ రోడ్డు గుండా ప్రయాణించే ప్రయాణికులకు మరో తీపి కబురు అందడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కెనాల్ రోడ్డుపై ఏడాది లోపే ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రూ.ఏడు కోట్ల వ్యయంతో రోడ్డు మరమ్మతులు చేయించడం మరోసారి ఈ ఏడాది మరో ఏడు కోట్ల రూపాయలతో రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టడంతో పార్టీలకతీతంగా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.అంతేగాక నాలుగు లైన్ల రోడ్డుగా విస్తరించేందుకు ఎమ్మెల్యే చూపిన చొరవతో ఆర్ అండ్ బి రహదారుల్లో వాహన రద్దీ అత్యధికంగా ఉన్న 12 రోడ్లో కాకినాడ-రాజమహేంద్రవరం కెనాల్ రోడ్డు ఉండటంతో ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి కృషి ఫలితమే అని నియోజకవర్గ ప్రజలే కాకుండా ఈ ప్రాంతం గుండా ప్రయాణించే అనేక నియోజకవర్గ ప్రజలు అభినందిస్తున్నారు.ముఖ్యంగా అనపర్తి,మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల ప్రజలే కాకుండా ఇంకా అనేక ప్రాంతాల నుండి కాకినాడ - రాజమహేంద్రవరం కెనాల్ రోడ్డు మీదుగా ప్రయాణించడంతో పాటు ప్రతిరోజు వేలాది ద్విచక్రవాహనాలు, వందలాది ఫోర్ వీలర్స్, భారీ వాహనాలు రాకపోకలు కొనసాగిస్తాయి.దీంతో నాలుగు లైన్ల రోడ్డు గా విస్తరించేందుకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తమ వంతు ప్రయత్నం గట్టిగానే చేయడం ముఖ్యమంత్రి దృష్టికి ప్రత్యేకంగా తీసుకెళ్లి కెనాల్ రోడ్డు ప్రాముఖ్యత వివరించడం జరిగింది. కాకినాడ- రాజమహేంద్రవరం మధ్య 60 కిలోమీటర్లు నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ కు రూ.680 కోట్లు అంచనా తో పిపిపి విధానంలో నిర్మించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఒక అనపర్తి నియోజకవర్గ ప్రజలే కాకుండా చుట్టుపక్కల ప్రాంత ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేయడంతో పాటు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

## మర్యాద పూర్వకంగా నూతన ఎస్ఐ ని కలిసిన టీడీపీ నేతలు



**.పోరుమామిళ్ల, ఫిబ్రవరి 04(అంకుశం పత్రిక):** బుధవారం నూతన ఎస్ఐ గా భాద్యతలు స్వీకరించిన పి.హనుమంతును కాశినాయన మండల తెలుగు యువత అధ్యక్షుడు పంగా రవీంద్రారెడ్డి, టీడీపీ నాయకుడు మురుకూటి విజయకుమార్ పోలీస్ స్టేషన్ లోని ఆయన చాంబర్ లో కలిసి స్వాగతం పలికి శుభాకాంక్షలు అందచేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ హనుమంతుకు గౌరవ సూచకంగా పూలమాల వేసి, మిఠాయి అందచేసి గౌరవించుకున్నారు.